www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 29 డిసెంబర్ 2025

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలి

సిఎం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి : జెఎసి

మానవ హారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలంటూ రాయచోటి పట్టణంలో జెఎసి ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ చేపట్టారు.ఆదివారం మధ్యాహ్నం రాయచోటి జిల్లా కేంద్రం కొనసాగించాలంటూ, మదనపల్లి వద్దు రాయచోటి ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీకి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. చెక్ పోస్ట్ శివాలయం నుంచి బంగ్లా సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బంగ్లా కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయచోటికి వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు అన్నమయ్య జిల్లా రాయచోటిని జిల్లా కేంద్రం గా ఉంటుందని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు. వెనుక బడిన రాయచోటిని అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. మదనపల్లి వద్దు రాయచోటి ముందు అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరు ఆలోచించేవరకు రాయచోటలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉంటామని వారు హెచ్చరించారు. అనంతరం టిడిపి నియోజకవర్గ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ని జిల్లా కేంద్రంగా ఉండేందుకు అన్ని అర్హతులు ఉన్నాయన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కేంద్రం రాయచోటి ఉండేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాసరాజు, మదనమోహన్ రెడ్డి, టిడిపి నాయకులు మౌర్య రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, రవీంద్రారెడ్డి, మహిళా నాయకురాలు సుజాత, జేఏసీ నాయకులు, టిడిపి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు

ప్రభుత్వం స్పష్టతనివ్వాలి : జెఎసి

రాయచోటి అర్బన్ : గత మూడు సంవత్సరాలుగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని రాయచోటి ప్రజా సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. ఆదివారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ చిత్రపటం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతున్న దని ఇక్కడ కలెక్టర్, ఎస్పి కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి కొన్ని కార్యాలయం భవనాలను కూడా ప్రభుత్వం నిర్మించిందన్నారు. ఈ పరిస్థితులలో అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మారుస్తున్నట్లు రైల్వే కోడూరును తిరుపతిజిల్లాలో, రాజంపేటను కడపజిల్లాలో, రాయచోటిని మదన పల్లి జిల్లాలో కలుపుతున్నట్టు వార్తలు వస్తున్నాయన్నారు. దీంతో మూడు ప్రాంతాల ప్రజలు గందరగోళ్ల పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితి పై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాల ని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల జెఏసి నేతలు ఈశ్వర్, రామాంజనేయులు, పి రెడ్డయ్య, రమేష్ బాబు, శ్రీనివాసులు, రమణ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం ఉద్యమానికి మద్దతుగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు వారు సంయుక్తంగా రిమ్స్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మ అధ్యక్షులు అబ్బూరి ప్రభాకర్ నాయుడుతో పాటు రక్తదాతలు విశేషంగా పాల్గొని రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా ప్రకటించాలంటూ ప్లకార్డులు ధరించి రక్తదానం చేశారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వారు రక్తదాతలకు పండ్లు, జ్యూస్‌తో పాటు భోజనంతో కూడిన బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు డాక్టర్ శంకర్‌నాయుడు, వెంకట సుబ్బయ్య నాయుడు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాను విభజిస్తే కూటమికి ఓటమి తప్పదు

ప్రజాశక్తి-రాజంపేట : శ్రీతాళ్లపాక అన్నమాచార్యులు పుట్టి నడయాడిన ప్రాంతాన్ని ఆయన పేరు మీద జిల్లా కేంద్రం ప్రకటించకుండా అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలు చేస్తే కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదని రాజంపేట జిల్లా సాధన సమితి సభ్యులు హెచ్చరించారు. జిల్లా సాధన కోసం గత 19 రోజులుగా పాత బస్టాండు కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలలో ఆదివారం వారు మాట్లాడుతూ పార్టీలు వాటి రాజకీయ లబ్ధి కోసం జిల్లాలు, మండలాలను విభజించుకుంటూ పోతే ప్రజాగ్రహం తప్పదన్నారు. స్థానిక నేతలు పదవుల పాకులాట వదిలి అవసరమైతే రాజీనామాలు చేసి రాజంపేట ప్రజల ఆకాంక్ష అధిష్టానానికి తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెఎసి సభ్యులు పూలభాస్కర్, అబ్బూరి ప్రభాకర్‌నాయుడు, నీలి ఈశ్వరయ్య, చల్లా సుధాకర్, నందగోపాల్, మహాదేవయ్య, సి.వి సుబ్బారెడ్డి, హరికృష్ణ యాదవ్, నాగూర్, కట్టారు నాగభూషణ్ రెడ్డి, శ్రీలత, ఆచారి, పెంచలయ్య, సంజీవ నాయుడు పాల్గొన్నారు.

దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న జెఎసి సభ్యులు

అన్నమయ్య జిల్లాను రద్దు చేయొద్దు : వైసిపి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడదీయొద్దు, రద్దు చేయొద్దని, ప్రజల మనోభావాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే గుణపాఠం తప్పదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, భావోద్వేగాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకునేవా రెవరైనా చరిత్ర హీనులవు తారన్నారు. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి లక్ష్య గా 2022 ఏప్రిల్ 4న ఏర్ప డిన అన్నమయ్య జిల్లాను మొదట విభజించి, ఇప్పు డు పూర్తిగా రద్దు చేయాలనే కుట్రలకు పాల్పడటం దుర్మా ర్గమైన ఆలోచన అని పేర్కొన్నారు. 17 ఏళ్ల పాటు ముఖ్యమంత్రి గా పనిచేసిన చంద్ర బాబు నాయుడు ఈ ప్రాంతానికి ఏ చిన్నపాటి మేలు చేయలేదని తెలిపారు. అలాంటి వ్యక్తి ఇప్పటికే సాధించుకున్న జిల్లాకు మంగళం పాడాలని చూస్తుండటం అన్యాయ మన్నారు. అన్నమయ్య జిల్లాను యధాతథంగా కొనసాగించాలని తెఇపారు. రాయచోటి ప్రాంతానికి అభివృద్ధి జరిగిందంటే అది వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనూ మాత్రమేనన్నారు.

మానవ హారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తున్న జెఎసి నాయకులు

రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి రెడ్డి సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతా మని కార్యవర్గ సభ్యుల సమావేశంలో తీర్మానించారు. శనివారం బెంగళూరు రోడ్డులో రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్‌రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సభ్యుల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించామన్నారు. నూతన సంవత్సరం- 2026లో అడుగు పెట్టబోతున్న నేపథ్యంలో రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సంఘం అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇందుకు సభ్యుల సహకారం అవసరమని కోరారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు రామచంద్రారెడ్డి,ఉపాధ్యక్షులు వి.సాంబశివారెడ్డి, కోశాధికారి వై.గిరిధర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కే.సుధాకర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'సీమ' జానపదంలో మేటి పరిశోధకుడు 'పేటశ్రీ'

ప్రజాశక్తి - కడప అర్బన్ :

రాయలసీమ జానపద పరిశోధనలో అనేక అంశాలను వెలుగులోకి తీసుకురావడమేగాక, విద్యార్థులచే పరిశోధనలు చేయించిన మేటి పరిశోధకులు ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి అని మైదుకూరు తెలుగు అధ్యాపకులు డాక్టర్.కోడూరు జయప్రకాష్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 150వ సదస్సులో భాగంగా 'ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి జీవితం- సాహిత్యం' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. మైదుకూరు మేధా జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ కోడూరు జయప్రకాష్ వక్తగా విచ్చేశారు. తన ప్రసంగంలో ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి (పేటశ్రీ) కథారచయితగా, జానపద పరిశోధకులుగా, విమర్శకులుగా తనదైన శైలిలో సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారన్నారు. విద్యాభ్యాసమంతా తిరుపతిలోనే సాగిందని చెప్పారు. 1992లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తెలుగు అధ్యయనశాఖలో సహాయ ఆచార్యులుగా చేరి 2007లో ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందా రన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ కోడూరు జయప్రకాశ్‌ను సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, సిబ్బంది, ఎస్. సుబ్బరాయుడు, కొత్తపల్లె రామాంజనేయులురెడ్డి, కృష్ణానందం, కందిమళ్ల రాజారెడ్డి కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రసాదు, చంద్రశేఖరరెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, ముడియం కిశోర్, కుమార్, నాగిరెడ్డి రఘునాథ రెడ్డి, మల్లేష్, దక్షిణామూర్తి, లక్ష్మిరెడ్డి, రమమూర్తి పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వై.ఎస్. రాజారెడ్డి ఎసి స్టేడియంలో అండర్ -12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్, ఎసిఎ సౌత్ జోన్ కన్వీనర్ సంజయ్ కుమార్‌రెడ్డి, కాజా మొహిద్దిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్- 12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన 80 మందిని ప్రాబబుల్స్ మ్యాచ్‌లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రాబబుల్స్ మ్యాచ్‌లలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా జట్టు ఎంపికలకు సెలక్టర్లుగా శ్రీకాంత్ రెడ్డి, అశోక్ వ్యవహరించారు.

సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని స్కూటర్ ర్యాలీ

మదనపల్లెలో సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన స్కూటర్ ర్యాలీ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మదనపల్లి పట్టణంలో ఆదివారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరీంద్రనాథ్‌శర్మ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి నుండి ప్రారంభమైన ర్యాలీ బెంగళూరు బస్టాండ్, అవెన్యూ రోడ్డు, సుందరయ్య సర్కిల్, సిటిఎం రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. ర్యాలీ ఆద్యంతం 'లేబర్ కోడ్స్ రద్దుచేయాలనీ, కనీసవేతనం రూ.26 వేల వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, ప్రయివేటీకరణ వద్దు.. వద్దు, హలో కార్మిక.. చలో విశాఖ, సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరీంద్రనాథ్ శర్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి డి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అఖిలభారత మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్తు పోరాటాలు రూపొందిస్తారని తెలిపారు. మహాసభలో కార్మిక వర్గ సమస్యల పరిష్కారం, పోరాటంతో పాటు ప్రజల్లో చైతన్యాన్ని పెంచడానికి చేపట్టాల్సిన కృషిపై దిశానిర్దేశం చేయనున్నట్లు వివరించారు. జనవరి 4న జరిగే బహిరంగ సభలో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రఘునాథ్, మధురవాణి, అంగన్వాడి యూని యన్ నాయకులు గంగాదేవి, విజయ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, రాజు, రామచంద్ర, కృష్ణయ్య, గోపాల్ పాల్గొన్నారు.

బిజెపి విధానాలతో భారత రాజ్యాంగానికి ప్రమాదం

సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

బిజెపి విధానాలతో భారత రాజ్యాంగానికి ప్రమాదకరమని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ పేర్కొన్నారు. సిపిఐ శతజయంత ఉత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ అన్నమయ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో మదనపల్లి పట్టణంలోని శ్రీకృష్ణ పంక్షన్ హాల్‌లో భారత రాజ్యాంగం పరిరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ ముసుగు వేసుకున్న దొంగలకు అప్పగిస్తున్నారని, సహజ వనరులు నాశనం చేస్తున్నారని, ప్రశ్నించే ఆదివాసులను ఆపరేషన్ కాగార్ పేరుతో బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తున్నారని వాపోయారు. ప్రకృతి సంపదను అదానికి దోచి పెట్టడానికే మోడి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. కొంతమంది వందేళ్ల కాలంలో కమ్యూనిస్టు పార్టీ ఏమి చేసిందని అంటున్నారని, ఈ దేశంలో ప్రజల హక్కులు అడిగే ధైర్యాన్ని, ప్రజలకు పోరాట పాఠాలు నేర్పింది కమ్యూనిస్టు పార్టీనే అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది కామ్రేడ్స్ ప్రాణాలు త్యాగం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. మన దేశానికి ఆర్ఎస్ఎస్ ప్రమాదమని, ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. రాజ్యాంగంలోని లౌకిక, సామ్యవాద అనే అంశాలను తొలగించి, మనుధర్మ శాస్త్రాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మహేష్, సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప, కార్యవర్గ సభ్యులు సాంబ శివ, మనోహర్ రెడ్డి, శీను, చిన్నయ్య, వెంకటేష్, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, మాధవ్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణ

మా గోడు పట్టించుకోండి

విఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరసింహులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సుదీర్ఘ కాలంగా పోరాటాల ఫలితం అసెంబ్లీలో ఆమోదించిన వాల్మీకిబోయల గిరిజన రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించి, ఆమోదింప చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విఆర్ఎస్ఎస్ పార్టీ కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చే విషయంపై ఇటీవల అసెంబ్లీలో మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్‌లో చర్చించినా కొలిక్కి రాకపోవడం దారుణమన్నారు. 2017డిసెంబరు 2న అసెంబ్లీలో వాల్మీకి బోయలను గిరిజనులుగా గుర్తించాలని బిల్లును ఆమోదించి, పార్లమెంట్‌కు పంపి నేటికీ పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్టి రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బిజెపి ఒక భాగమైనప్పటికీ, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కేంద్రంలో బిజెపి కే మద్దతిస్తున్నప్పటికీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాల్మీకి బోయలకు అన్యాయం చేయాలని చూస్తే ఐక్య పోరాటాలతో అసెంబ్లీ ముట్టడి, ఎమ్మెల్యేలు, మంత్రుల నివాసాల ముట్టడికి పిలుపునిస్తామని అధికార, ప్రతిపక్షాలను హెచ్చరించారు. కార్యక్రమంలో బొగ్గిటి కృష్ణమూర్తి, వాల్మీకిపురం విష్ణు, ఉలసల మంజు, నరసింహులు, రెడ్డిశేఖర్, శ్రీనాథ్, రవి కుమార్, భాను ప్రకాష్, జయచంద్ర, ప్రవీణ్, పురుషోత్తం, సందీప్, దిలీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పొదల నరసింహులు

ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తాం

రూ.5.43 కోట్లతో 128 పనులు
92 శాతం పింఛా పనులు పూర్తి
ఇరిగేషన్ ఎస్ఇ ఎం.అబ్దుస్ సమీ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా నీటిపారుదలశాఖ పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం. ఇందులో భాగంగా ఆపరేషన్ అండ్ మెయింటె నెన్స్ వర్క్స్, పింఛా ప్రాజెక్టు, రూ.5 కోట్లతో చేపట్టిన బుగ్గవంక పెండింగ్ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాం. వీటితోపాటు రూ.12 కోట్లతో పుట్లంపల్లి చెరువు ఆధునీకరణ, బుగ్గవంక ప్రాజెక్టు కాల్వ పెండింగ్ పనులు పరుగులు తీయించాల్సి ఉంది. ఇంతటితో ఆగకుండా పూర్ణోదయ, ఎన్ఎస్‌పి స్కీములకు ప్రతిపాదనలు పంపించాం. ఈఏడాది కడప, అన్నమయ్య జిల్లాలోని 1,392 చెరువు లకుగానూ 370 చెరువులను నింపడంతో జలకళను సంతరించుకున్నాయని పేర్కొంటున్న ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.అబ్దుస్‌సమీతో ముఖాముఖి...

ఇరిగేషన్ పరిధిలోని చెరువుల వివరాలు తెలపండి?

ఉమ్మడి కడప జిల్లా పరిధిలో 1,392 చెరువులున్నాయి. ఈ ఏడాది జిల్లాలో కురిసిన వర్షాలు, శ్రీశైలం వెనుకజలాల నుంచి తరలించిన కృష్ణాజలాల కారణంగా 370 చెరువులు పూర్తిస్థాయిలో నింపాం. దీంతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, జిల్లా నీటి పారు దలశాఖ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా చెరువుల్లో జలకళను సంత రించుకున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు.

పెండింగ్ ప్రాజెక్టుల గురించి స్పందించండి?

ఉమ్మడి జిల్లాలోని పింఛా ప్రాజెక్టు 92 శాతం మేరకు పునరుద్ధరణ పనులు చేపట్టాం. ఝరికోన ప్రాజెక్టు పెండింగ్ పనులు చేపట్టడంపై ప్రతిపాదనలు పంపించాం. రూ.ఐదు కోట్లతో బుగ్గవంక ఆధునికీకరణ పనులు చేపట్టాం. లైటింగ్ సిస్టమ్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉంది.

డిఎంఎఫ్ పనుల పురోగతిని వివరించండి?

కడప, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు, ఒంటిమిట్ట ప్రాంతాల్లోని 52 పనులకు రూ.9.98 కోట్లతోఆమోదం లభించింది. ఇందులో భాగంగా 34 పనులు పూర్తి చేశాం. ఐదు పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

ఒఅండ్ఎం పనుల ప్రోగ్రెస్ ఎలా ఉంది?

జిల్లానీటిపారుదలశాఖలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ స్కీ మ్ కింద 128 పనులు చేపట్టాం. ఇందులో 95 పనులు పూర్తి చే శాం. మరో 33 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

బుగ్గవంక మందకొడితనంపై మీరేమంటారు?

బుగ్గవంక ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్న సంగతి వాస్తవమే. 2018, 2019 సంవత్సరాల్లో మేరకు బుగ్గవంక డ్యామ్ పనులు చేపట్టారు. అప్పట్లో 65 శాతం బుగ్గవంక డ్యామ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన కాల్వల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

ఎల్ఎస్‌పి పనుల తీరుతెన్నులపై స్పందించండి?

రూ.3.8 కోట్లతో లోయర్‌సగిలేరు ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమైంది. గతేడాది కింద రూ.4.6 కోట్లతో గేట్ల ఏర్పాటుకు రివైజ్డ్ ప్రతిపాదనలు అందజేశాం. అనుమతి రాగానే పూర్తి చేయడం జరుగుతుంది.

పూర్ణోదయ, ఎన్ఎస్‌పి స్కీముల ప్రతిపాదనల పరిస్థితేమిటి?

జిల్లాలో పూర్ణోదయ స్కీమ్ కింద 187 చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపించాం. రిపేర్స్, రెక్టిఫికేషన్స్, రెనోవే షన్స్ స్కీమ్ కింద కేంద్రప్రభుత్వం 60 శాతం, రాష్ట్రప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంది. ఎన్ఎస్‌పి స్కీమ్ (నార్మల్ స్టేట్ ఫండ్స్) కింద రూ.12 కోట్లతో 27 పనులను ప్రతిపాదనలు అందజేశాం.

పాడా పనుల గురించి తెలపండి?

పాడా కింద 612 పనులు చేపట్టడమైంది. ఇందులో 330 పనులు పూర్తి చేశారు. వీటిపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. దీనిపై మాట్లాడడానికి ఏమీ లేదు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-రాయచోటి

141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి జెండా ఎగురవేశారు. జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ ఆలీ ఖాన్,కిసాన్ కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి మాట్లాడుతు దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ పుట్టిందని పేర్కొన్నారు.జాతీయోద్యమంలో స్వాతంత్ర్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించి దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ముందుందని వారు తెలిపారు. 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మంది మేధావులతో సంప్రదించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ పెంచడానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో డిసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, నాయకులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బెంగళూరు బస్టాండులోని దివంగత మాజీ ప్రధాని ఇందిరమ్మ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ కె బాష, తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.

రాయచోటి : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వీధి దీపాలను పరిశీలిస్తున్న సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం పుల్లంపేట గ్రామపం చాయతీలో వీధిలైట్లు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులతో పాటు ప్రతి వీధిలో అవసరమైన చోట కొత్త ఎల్ఇడి దీపాలను ఏర్పా టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం ,సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మతులతో పాటు కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు విషపురుగుల బారిన పడటంతో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందన్నారు. గ్రామపంచాయతీలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసు కువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయితీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అన్ని విధాల కృషి చేస్తామని తెలి పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి

-మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రామపురం

రాయచోటిని మదనపల్లి జిల్లాలో కలపవద్దని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని లేదా కడప జిల్లాలో కలపాలని టిడిపి సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. సోషల్ మీడియాలో అన్నమయ్య జిల్లాను పూర్తిగా రద్దు చేస్తూ వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. భౌగోళికంగా రాయచోటి నియోజక వర్గం కడప జిల్లా కేంద్రానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉందని, మదనపల్లె జిల్లా కేంద్రానికి పోవాలంటే 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలని తెలిపారు. రైల్వే కోడూరు నియోజక వర్గ ప్రజల అభీష్టం మేరకు వారిని తిరుపతి జిల్లాలో కలపడం వలన వాళ్ళు సంతోషంగా ఉన్నారని, రాజంపేట నియోజక ప్రజల అభీష్టం మేరకు వాళ్లను కడప జిల్లాలో కలపడంతో వాళ్ళు సంతోషంగా ఉన్నారని, మదనపల్లె జిల్లా కేంద్రం చేయడంతో పీలేరు, తంబళ్లపల్లె,పుంగనూరు నియోజక ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఇపుడు రాయచోటి నియోజక వర్గ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. మా నియోజక వర్గ ప్రజల అభీష్టం మేరకు అన్నమయ్య జిల్లాను ఉంచాలని లేని పక్షంలో రాయచోటి నియోజక వర్గాని కడప జిల్లాలో కలపాలని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళుతానని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప

న్యూ ఇయర్ పేరుతో డిసెంబర్ 31వ తేదీ రాత్రి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్న రెడ్డప్ప పేర్కొన్నారు. నూతన సంవత్సరం పేరుతో డిసెంబర్ 31న మందుబాబులు పలువురు డిజె సౌండ్‌తో డాన్సులు, పేకాటలు, కోడి పందాలు, త్రిబుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుట చట్టరీత్యా నేరమన్నారు. మండల ప్రజల కు కొత్త సంవత్సరం వేడుకలకు అనుమతులు ఎక్కడ ఇవ్వడం లేదన్నారు. నిబం ధనలు ఉల్లంఘించి యువత డిజే సౌండ్ పేరుతో డాన్సులు రోడ్లమీద కేక్ కటిం గ్లు, అర్ధరాత్రిలు ట్రిబుల్ డ్రైవింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదన్నారు. మద్యం సేవిం చి వాహనాలు నడపరాని, పబ్లిక్ ప్రదేశాల్లో డిజెలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం కేకులు కట్ చేసుకుని శుభాకాంక్షలు మాత్రమే చెప్పుకో వాలన్నారు. నిబంధనలు అతిక్ర మించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా, పేకాట శిబిరాలు నిర్వహించిన అసంఘాకిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. నిబంధనలో అతిక్రమిస్తే పోలీసులు శాఖా పరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొనారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ముద్దనూరు :నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చికి సంబంధించి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎల్ఎమ్‌సి, జెఎంజె, డేంజర్ టీములకు చెందిన సీనియర్, జూనియర్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్లో జెఎమ్‌జె, డేంజర్ టీములు తలపడగా, డేంజర్ లెవెన్ విజయం సాధించి విన్నర్‌గా నిలిచారు. జెఎమ్‌జె లెవెన్ రన్నరప్‌గా నిలిచారు. అంపైర్లుగా అరుణ్, ప్రవీణ్ వ్యవహరించారు. కామెంటేటరుగా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించారు. విజేతలకు జనవరి 1న రెవరెండ్ డ్యానియేల్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు ఏసుదాస్, యాకోబు, సువార్త, చంద్ర, కిరణ్ తెలిపారు.

ఐక్యంగా సమస్యల్ని పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ :ఐకమత్యంతోనే సమస్యల్ని పరిష్కరించుకుందామని పులివెందుల తాలూకా ఈడిగ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండయ్య గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి కల్యాణమండపంలో ఆదివారం గౌడ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండయ్య గౌడ్ మాట్లాడుతూ అయిదేళ్లుగా ఈడిగ గౌడ సంఘ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి సభ్యుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గౌడ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. సంఘం తరఫున పలు సేవా కార్యక్రమాలను 2026లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంఘం తరఫున కష్టపడిన చదివిన ఎవరైనా బీద కులస్తుల విద్యార్థులకు ఆర్థికసాయం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సూర్యనారాయణ గౌడ్, గౌరవ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య గౌడ్, గౌరవ సలహాదారులు మురళి నాథ్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి ముని ప్రసాద్ గౌడ్, పాల్గొన్నారు.

మటన్ దుకాణాలపై నిఘా పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె :మటన్ దుకాణాలపై నిఘా పెంచి ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని అందేలా చూడాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా కోరారు. ఆదివారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో మాంసం దుకాణాలను రహమతుల్లా పరిశీలించారు. అయిదు వారాల నుంచి ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మటన్ నాణ్యతను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వారం మటన్ దుకాణాలపై నిఘా పెట్టడంతో మేకలు, గొర్రెల మాంస విక్రయాన్ని నియంత్రణ చేయగలుగుతు న్నామన్నారు.కొందరు రహస్యంగా గొర్ల మాంసాన్ని తెచ్చి విక్రయిస్తున్నారని, పం చాయతీ ఇఒ వారిపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. నాణ్యతలేని మాంసం విక్రయాలపై ఫిర్యాదులు చేసినా ఫలితంలేదనే ఆరోపణలున్నాయి.

పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి - సింహాద్రిపురం : టిడిపి కోసం కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. టిడిపి కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి లోమడ మురళీ మోహన్ యాదవ్ ఆదివారం స్థానిక కార్యాలయంలో బీటెక్ రవిని కలిశారు. తనకు పార్టీలో పదవి రావడానికి సహకరించిన బీటెక్ రవికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతస్థాయిలో తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అమర్నాథ్, నాయకులు మారుతి యాదవ్ పాల్గొన్నారు.

శివాజీ ట్రైల్ ట్రెక్కింగ్‌లో 'మిట్స్' ఎన్‌సిసి విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి టౌన్

ట్రెక్కింగ్‌లో పాల్గొన్న ఎన్‌సిసి విద్యార్థులు

మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన 16 మంది ఎన్‌సిసి క్యాడెట్లు మహారాష్ట్ర రాష్ట్రం కొల్హాపూర్‌లో నిర్వహించిన ఆలిండియా ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్ శివాజీ ట్రైల్ ట్రెక్-2025లో విజయవంతంగా పాల్గొన్నారని యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌కు చెందిన మిట్స్ యూని వర్సిటీ ఎన్‌సిసి క్యాడెట్లు సహా దేశ నలుమూలల నుంచి వెయ్యికి పైగా పాల్గొని రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. చారిత్రక ప్రాధాన్యత గల పన్హాలా కోట నుంచి విశాల్ ఘర్ కోట వరకు సుమారు 63 కిలోమీటర్ల దూరాన్ని కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో ధైర్యంగా పూర్తి చేశారన్నారు. శివాజీ మహారాజ్ చారిత్రక వారసత్వాన్ని గుర్తు చేసే ఈ ట్రెక్కింగ్ ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, దేశభక్తి భావనలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. యూనివర్సిటి ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎన్. నవీన్‌కుమార్, 35 ఆంధ్ర ఎన్‌సిసి బెటాలియన్ (చిత్తూరు) అధికారులు శుభాకాంక్షలు తెలిపారు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మాధవి

ప్రజాశక్తి- పీలేరు

పీలేరు మండలం, తలుపులలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మహిళల నుంచి విశేష స్పందన లభించిందని పీలేరు మాధవి హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం తలుపుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి పైగా మహిళలు పాల్గొని, ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స, మందులు పొందారు. మాధవి హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఏ. మాధవి స్వయంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న గర్భాశయ సంబంధిత వ్యాధులు, సంతాన సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మాధవి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, అవగాహన లోపం కారణంగా అనేక మంది దంపతులు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను గుర్తించలేక సంతాన సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే ఆర్థిక, రవాణా సౌకర్యాలు లేని గ్రామీణ ప్రజలకు చేరువగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శిబిరంలో పిల్లలు లేని దంపతులు, గర్భాశయ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు రక్తస్రావం, తెల్లబట్ట సమస్యలు, సక్రమంగా లేని రుతుకేర్, అండాశయంలో గడ్డలు, ఫాలోపియన్ ట్యూబ్స్ సమస్యలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. పీలేరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన మహిళలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. అలాగే మాధవి హాస్పిటల్ లో తొలిసారిగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఐయూఐ ల్యాబ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చామని, పిల్లలు లేని దంపతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో భవిష్యత్తులోనూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మాకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భూకొనుగోలు దారులు

నానా కష్టాలు పడి అప్పు చేసి కొనుగోలు చేసిన భూమిలో మమ్మల్ని రానీయకుండా అరుంధతి వాడకు చెందిన కొందరు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వివాదాస్పద భూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కోడూరు పట్టణంలోని గంగమ్మతల్లి బత్యాల భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కోడూరు పట్టణంలోని సర్వే నంబర్ 5713 లో 1980 నుంచి 2012 వరకు సుమారు 130 మంది భూమిని కొనుగోలు చేశారని పేర్కొన్నారు. భూమిని కొనుగోలు చేసిన సమయంలో ఎటువంటి అభ్యంతరాలు లేవని అయితే 2017 సంవత్సరంలో ఈ భూమి మాది అంటూ అరుంధతివాడకు చెందిన కొంతమంది దౌర్జన్యాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేసారని తెలిపారు. గత ప్రభుత్వంలో అధికారులు దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానానికి వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ పోలీసు ప్రొటెక్షన్ తో సహా అధికారులతో సంప్రదిస్తే మాకు న్యాయం చేయకపోగా మమ్మల్ని భయానికి గురిచేసి వారితో చర్చలు జరిపి మా వద్ద నుండే సుమారు పది లక్షల రూపాయలు వారికి ఇప్పించారని బాధితురాలు తులసి కంటతడి పెట్టారు. డబ్బులు చెల్లించిన మరలా కొంతమంది మాకు డబ్బులు ఇవ్వాలంటూ దౌర్జన్యాలకు పాల్పడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారుల్లోకి రాగానే మా సమస్యను వారికి వివరించగా జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే స్పందించిన స్థానిక తహసిల్దార్ అమర్నాథ్ 40 రోజుల క్రితం రెండు గ్రూపులను వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారని చెప్పారు. అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం ఈ భూమి కొనుగోలుదారులకు చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం పోలీసుల రక్షణతో భూమి వద్దకు వచ్చి కొనుగోలు చేసిన వారికి హద్దులు చూపించారు. ఇక్కడ వివాదాల సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని అరుంధతి వాడకు చెందిన వారిని హెచ్చరించారు. అయినా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి మాపై దాడులు చేశారు. భూమి కొనుగోలు చేసిన మాపై కేసులు నమోదు చేశారు. అరుంధతి వాడకు చెందిన వారికి పత్రాలు సక్రమంగా ఉంటే మేమే స్వచ్ఛందంగా వారికి భూమిని అప్పగిస్తామన్నారు. మా భూములు మేము వెళ్ళుటకు అధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

క్రీడల్లో మహేంద్ర కృషి అభినందనీయం

మహేంద్రను సన్మానిస్తున్న మహేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతదేశంలో జాతీయస్థాయిలో నిర్వహించే సంతోష్ ట్రోఫీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్లకు మహేంద్ర ప్రాతినిధ్యం వహించడం మదనపల్లె ప్రజలకు గర్వకారణమని ఎపిఐఐసి డైరెక్టర్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ మైఫోర్స్ మహేష్ ప్రశంసించారు. ఆదివారం మహేంద్రను దుశ్శాలువాతో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేంద్ర గత పదేళ్లుగా మైఫోర్స్ సేవా కార్యక్రమాలలో, మైఫోర్స్ నిర్వహి ంచిన క్రికెట్, ఫుట్ బాల్, హాకీ టోర్నమెంట్లు నిర్వహణలో కీలకపాత్ర పోషించి మైఫోర్స్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్‌గా సమాజ సేవలో ఎంత కృషి చేసిన మహేంద్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్ బాల్ టీంలో స్థానం పొంది సంతోష్ ట్రోఫీలో ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడడం మదనపల్లె ప్రజలకి గర్వకా రణమన్నారు. మహేంద్ర మరిన్ని విజయాలు అందుకొని భారతదేశ ఫుట్‌బాల్ టీంకి ప్రాతినిధ్యం వహించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు మహేంద్ర ఆదర్శ ప్రా యంగా నిలిచి క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించే విధంగా కూటమి ప్రభుత్వం ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టే విధంగా నావంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేనపార్టీ చిత్తూరు జిల్లా లెవెల్ అధ్యక్షులు అమరనా రాయ ణ, మైఫోర్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు సందీప్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

10న తిరుపతిలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు

పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బ్యాంకుల్లో వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగవేసిన వారంతా దేశభక్తులుగా, రాజ్యాంగం హక్కుల కోసం పోరాడే వారంతా అర్బన్ నక్సలైట్లనే ముద్ర వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా గొంతుకలను నొక్కేస్తున్నాయని పౌర ప్రజాస్వామ్యకు హక్కుల సంఘాలు నేతలు విమర్శించారు. స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ఆదివారం వారు జనవరి 10న తిరుపతిలో జరిగే పౌరహక్కుల సంఘం 20వ రాష్ట్ర మహాసభల పోస్టర్స్‌ను ప్రజాసంఘాల నేతల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమ్మతిధిక్కారమనేవి ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగమన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ఫాసిస్టు పాలకులకు ఇవి ఎంత మాత్రం గిట్టవని, అందుకే ప్రజాస్వామ్య వాదులను నక్సలైట్లు, టెర్రరిస్టులని ముద్ర వేసి దేశంలో అనేక చోట్ల పెరుగుతున్న అసమ్మతి నిధిక్కార భావనలను క్రూరంగా అణచివేస్తున్నారనారు. భారత పౌరుల పౌరసత్వాన్ని ప్రశ్నించే వారి ఓటు హక్కులను తొలగించి, వారిని పరాయి పౌరులుగా మార్చే విధానాన్ని ఎన్నికల సంఘంచే అమలు చేస్తున్నా రన్నారు. విద్వేష రాజకీయాలు సాగిస్తున్న కేంద్ర పాలకులు తీరును ప్రజాస్వామిక వాదులు అందరూ ప్రశ్నించాలన్నారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత 50 ఏళ్లుగా ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంటూ త్యాగాలను చేస్తోందన్నారు. నేటి పరిస్థితుల్లో పౌరహక్కుల ఉద్యమాన్ని ప్రజాసంఘాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు, దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మురళి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రాజేష్, సిఎంఎస్ పద్మ, విరసం వరలక్ష్మి, విద్యావంతుల వేదిక ఎస్పీ మహమూద్, పీకేఎస్ శ్రీనివాసులురెడ్డి, నాగేంద్ర, బిఎస్ఎస్ జై చంద్ర, వెంకటరెడ్డి, మహిళా శక్తి వడ్ల లక్ష్మీదేవి, ఆర్విఎస్ హరిత పాల్గొన్నారు.

వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రాజుపాలెంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో ఇంటింటికి తిరిగి రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రధాన మార్గంలో వస్తున్న ప్రయాణికులను ఆపి హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ.. మన శరీరంలో ఎక్కడ గాయమైనా ఫర్వాలేదని, తలకు దెబ్బ తగిలితే పరిస్థితి విషమంగా మారుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించాల్సిన అవసరం గురించి వివరించారు. బైక్‌లో ముగ్గురు వెళ్లరా దన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. హెల్మెట్ ధరించి వచ్చిన వారిని ఆఅభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ సిద్దయ్య వాహనదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ గౌరీశంకర్, మౌనయఆచారి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

మాట్లాడుతున్న చెన్నక్రిష్ణారెడ్డి

'వెలిగల్లు'కు చేరుకున్న హెచ్ఎన్ఎస్ఎస్ జలాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని వెలిగల్లు జలాశయానికి హెచ్ఎన్ఎస్ఎస్ కాలవ నుంచి కృష్ణా జలాలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవతో హంద్రీనీవా సుజల స్రవంతి కాలవ ద్వారా వెలుగల్లు జలాశయానికి నీరు చేరాయని టిడిపి నాయకులు చెన్నక్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం పూర్తిగా కరువు ప్రాంతం కావడంతో వెలిగల్లు ప్రాజెక్టుకు నదులు అనుసంధాన పనులు పూర్తి చేసి నీళ్ల పొలాలకు పారించే ఉద్దేశంతో మంత్రి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో నీటి పారుదల శాఖ అధికారులు సత్యసాయి జిల్లా నుంచి ప్రధానకారుల ద్వారా స్వల్ప అడ్డంకులు తొలగించుకుంటూ ఆదివారం ప్రయోగాత్మకంగా వెలిగల్లు ప్రాజెక్టులోకి హంద్రీనీవా సుజల స్రవంతి కాలువల ద్వారా నీటిని మళ్ళించారని తెలిపారు. రాయచోటి నియోజకవర్గం ప్రజలకు మంత్రి చేసిన ప్రయత్నం నేటికీ కార్యరూపం దాల్చిందన్నారు. సమావేశంలో టిడిపి మహిళా విభాగం నాయకులు సుజాత పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎఒ మురళీ మోహన్

రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ అధికారి మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో వరి, పశుగ్రాసం, జొన్న పంటలను పండిస్తారని, వీటికి అవసరమైన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచా మన్నారు. మండలంలో రైతులకు 35.5 మెట్రిక్ పన్నుల యూరియాను ప్రభు త్వం కేటాయించిందన్నారు. మండలంలోని వాల్మీకిపురం -1, విఠలం, చింతపర్తి, మంచూరు, మూరేవాండ్లపల్లి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచా మ న్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకే విక్రయించడం జరుగు తుం దని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పిహెచ్‌డి పట్టా పొందిన ప్రభావతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియుఎ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిరవహిస్తున్న సి.ప్రభావతికి వెల్స్ విశ్వవిద్యాలయం చెన్నైలో పిహెచ్‌డి డిగ్రీ పూర్తి చేశారు. మొబైల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్ అనే అంశంపై డాక్టర్ ఎస్.మీరా మార్గదర్శకత్వంలో పరిశోధనల పూర్తి చేశారు. మొబైల్ ఐఓటీ నెట్‌వర్క్ శక్తి వినియోగాన్ని తగ్గిస్తాయి. పనితీరు మెరుగుపరిచేలా ఈ రీసెర్చ్ ప్రధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ సి.ప్రభావతిని కళాశాల సిబ్బంది, అధ్యాపకులు అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కలసపాడు

స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1988 నుండి 1993 మధ్యకాలంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు నూరు మంది పూర్వ విద్యార్థులతో పాటు, అప్పటి ఉపాధ్యాయులైన బి.సిద్దయ్య టి.మాలకొండయ్య, ఎం.ఏసుదాసు, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య హాజయ్యారు. కార్యక్రమంలో భాగంగా గురువులను మెయిన్ గేటు నుండి పూలు చల్లుతూ పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తదనంతరం వేదిక పైన భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులందరూ తమ బాల్యం మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ పరిచయం చేసుకున్నారు. తమ అభివృద్ధిలో ఉపాధ్యాయులు చేసిన కృషి, వారు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ ఎప్పటికీ మరువలేమన్నారు. పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లోని విద్యార్థిని, విద్యార్థులు చదువులో బాగా రాణించి, ఉన్నత స్థానాలలో స్థిరపడినందుకు చాలా సంతోషిస్తున్నామన్నారు. 32ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం పాఠశాలకు సుమారు రూ. 50వేలు విలువచేసే బీరువాలు, మైక్రోస్కోప్ ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య, సైన్స్ ఉపాధ్యాయులు జి.చెన్నారెడ్డి, డి.గురప్పకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట రామిరెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు పి.రమణారెడ్డి, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ బి.వి.రాజకిషోర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది కాకర్ల చెన్నారెడ్డి, ఉపాధ్యాయుడు కె.జె. ప్రవీణ్ కుమార్, పూర్వ విద్యార్థులు తిరుపాల్ రెడ్డి, లక్ష్మి ,సునంద,విజయలక్ష్మి రాజేశ్వరి, రోషిరెడ్డి, మార్కారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, మౌలాలి, ఓబయ్య, అబ్దుల్ ఖాదర్, బి.శేఖర్, నాయబ్ రసూల్, శ్రీనివాసులు, వెంకట సుబ్బారెడ్డి, రంగయ్య, బాలుడు, సదానంద్, సింగరయ్య, వెంకట్రామయ్య, జోసెఫ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోంది : బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నెరవేస్తోందని టిడిపి పులి వెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో ఎర్రబల్లె చెరు వుకు నీళ్ల నింపుతామని చెప్పామని, ఈరోజు ఆ మాట నిలు పుకున్నామన్నారు. రైతులు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో 32కు వందశాతం టిడిపినే కైవశం చేసు కుంటుం దన్నారు. తుంగభద్ర హెచ్ఎల్‌సి చైర్మన్‌గా మారెడ్డి జోగిరెడ్డి ఎన్నిక య్యార న్నారు. వైసిపి నాయకులు పులివెందుల ప్రాంతంలో తాగునీటినీటి సమస్య ఉందని ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్ల నుంచి జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, ఛైర్మన్లు, ఎమ్మెల్యే, ఎంపీలు మీరే ఉండి నీటి సమస్య గురించి ఈరోజు మాట్లాడడం సమంజసం కాదన్నారు. ప్రతి ఇంటికి తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వము లక్ష్యంగా ముం దుకు వెళుతున్నామన్నారు. పులివెందులలో ఆగిపోయిన కొన్ని పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వాటిని కూడా పూర్తి చేస్తా మన్నారు. క్రికెట్ స్టేడియం పనులను కూడా త్వరితగగిన పూర్తి చేస్తా మన్నారు. అరటి రేట్లు తగ్గాయని వైసిపి వారు రాద్ధాంతం చేశారని, తాము కొద్ది రోజుల్లో రేట్లు పెరుగుతాయని చెప్పామన్నారు. ప్రసుతం అరటి ధర రూ.20,000 ఉందన్నారు. గత ప్రభుత్వంలో పాడా నిధులు రూ.కోట్లు దుర్వి నియోగం అయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో లింగాల మండల ఇన్‌ఛార్జి దేవి రెడ్డి సంజీవరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్, అంబకపల్లె మునెయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మాజీ సర్పంచ్‌పై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ సర్పంచ్‌పై కొందరు యువకులు దాడి సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడు తాలూకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కోటవారిపల్లి మాజీ సర్పంచ్ రాజా మదనపల్లె నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. మార్గమధ్యంలోని ఈశ్వరమ్మ కాలనీ వద్ద కొందరు యువకులు కారుకు అడ్డు వచ్చి గొడవ చేశారు. మాజీ సర్పంచ్ కారు దిగి బయటకు రాగానే వాగ్వివాదానికి దిగి మూకుమ్మడిగా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డవారిపై తగుచర్యలు తీసుకోవాలని, ఎస్ఐ చంద్రమోహన్‌కు గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.